

నోడల్ అధికారిగా ఉమామహేశ్వరరావు



ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

బక్రీద్‌ను పురస్కరించుకుని రాష్ట్ర జంతు సంక్షేమ సంస్థ నియమావళిని అమలు చేసేందుకు జిల్లా నోడల్ అధికారిగా ఎఎస్‌పి (క్రైమ్) వి.ఉమామహేశ్వరరావును నియమించినట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో జంతువుల అక్రమ రవాణాను నియంత్రించేందుకు చెక్‌పోస్టుల వద్ద నిరంతరం విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో జంతువులను అక్రమంగా తరలించినా, జంతువధకు సంబంధించి సమాచారం ఉన్నా నోడల్ అధికారి ఫోన్ నంబరు 6309990803కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచనున్నట్లు తెలిపారు. సమాచారం అందించి పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

నిర్లక్ష్యపు నీడలో వంశ'ధార'

- 20.5 కిల మీటర్ల ఆధునికీకరణకు రూ.70 కోట్లు ప్రతిపాదన
- ఐదేళ్లుగా 22 వేల ఎకరాలకు అందని సాగునీరు
- పూర్తిగా పాడైన రెగ్యులర్ షట్టర్లు
- పనులు చేసేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు

వంశధార కాలువ అనగానే గత ఐదేళ్లుగా రైతుల్లో నిరాశ, నిస్పృహ చోటు చేసుకుంది. వంశధారకు నిర్లక్ష్యపు నీడ వెంటాడడంతో ఏటా శివారు భూములకు సాగునీరు అందని ద్రాక్షలా తయారైంది. వంశధారపై లక్షలాది ఎకరాల్లో వరి సాగు అవుతున్నా, పాలకులు, అధికారులు నిర్లక్ష్యానికి రైతుల పాలిట శాపంగా మారింది. వైసిపి ప్రభుత్వంలో ఒక్క రూపాయి వెచ్చించకపోవడంతో అధికారులు తయారు చేస్తున్న ప్రతిపాదనలు బుట్ట దాఖలు అవుతున్న పరిస్థితి.

ప్రజాశక్తి- పలాస

వంశధార ప్రధాన ఎడమ కాలువ 12 మండలాల్లోని 398 గ్రామాల పరిధిలో విస్తరించి ఉంది. ఎడమ ప్రధాన కాలువ ద్వారా 1,48,023 ఎకరాలకు సాగునీరు అందుతుంది. కాలువ నీరు 60 శాతం, వర్షం నీరు 40 శాతం కలిపి 2,480 క్యూసెక్కుల సాగునీరు అందించాల్సి ఉంది. ఇదిలా ఉండగా పలాస, కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో పలాస, వజ్రపుకొత్తూరు మండలాలతో పాటు నందిగాం మండలం కొంత భాగం 22 వేలు ఎకరాలకు సాగునీరు అందుతుంది. కానీ ఐదేళ్లుగా వంశధార అందని ద్రాక్షలా తయారైంది. నందిగాం మండలం కణితూరు నుంచి వజ్రపుకొత్తూరు వరకు 20.500 కిలో మీటర్ల మేర ఉన్న వంశధార కాలువకు నందిగాం మండలం కణితూరు, కొత్త అగ్రహారం, పలాస మండలం కేశపురం, ఈదురాపల్లి వద్ద ఏర్పాటు చేసిన రెగ్యులర్ షట్టర్లు పూర్తిగా పాడవడంతో నీరు నిల్వ ఉంచలేని పరిస్థితి ఏర్పడింది. శివారు భూములకు సాగునీరు అందించలేమని అధికారులు చెబుతున్నారు.

పనులు చేయాల్సింది ఇక్కడ

నందిగాం మండలం ఆనందపురం ప్రాంతంలో వంశధార కాలువ 7.30 మీటర్లు వెడల్పులో ఉండేది. ఆనందపురం సమీపంలో ఉన్న చెరువు గట్టుకు రక్షణ గోడ లేకపోవడంతో గట్టు మట్టి కాలువలో పేరుకుపోవడంతో సుమారు 4 మీటర్లు వెడల్పుకు తయారైంది. ప్రధాన కాలువపై రక్షణ గోడ నిర్మాణం చేపట్టాలి. అలాగే చెరుకుపల్లి కొండ దరి ప్రాంతంలో రక్షణ గోడ నిర్మాణం చేపట్టాలి. నందిగాం మండలం కణితూరు 61ఆర్ నుంచి ఆనందపురం 62ఆర్, కొత్త అగ్రహారం 63ఆర్, పలాస మండలం టెక్కలి పట్నం 64ఆర్, కేశుపురం 65ఆర్, బంటుకొత్తూరు 66ఆర్, ఈదురాపల్లి 67ఆర్, ఈదురాపల్లి 68 టిఇ రెగ్యులర్ వరకు మదుములు, షట్టర్లు పాడయ్యాయి. అధికారులు మరమ్మతులు చేపట్టాకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. పలాస మండలం పెద్దనారాయణ పురం వద్ద కాలువ వెడల్పు చేయడం, కేదారిపురం గొల్ల చెరువు దిగువ భాగంలో రాళ్లు తీయడం, కాశీబుగ్గ కాశీగుండం దేశబట్టి వద్ద రక్షణ గోడ, వజ్రపుకొత్తూరు మండలం గుల్లలపాడు దేశబట్టి వద్ద అవుట్ లెట్ వీయర్ నిర్మాణం చేపట్టాలి. కానీ, ఆ దిశగా ఎక్కడా నిర్మాణ పనులు చేయకపోవడంతో వంశధార కాలువ పాలిట శాపంగా మారింది.



అధ్వానంగా ఉన్న వంశధార కాలువ



మదుము వద్ద పేరుకుపోయిన రెల్ల గడ్డి

పైసా విడుదల కాని నిధులు

వంశధార కాలువ ద్వారా పంట భూములకు సాగునీరు అందిస్తే రెవెన్యూ అధికారులు నీటి తీరువా పన్నులు రూపంలో రైతుల నుంచి శిస్తు వసూలు చేసేవారు. ఏటా పలాస, వజ్రపుకొత్తూరు మండలాల నుంచి సుమారు రూ.30 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. పన్నుల రూపంలో వచ్చిన మొత్తాన్ని వంశధార కాలువ తాత్కాలిక పనులకు వినియోగించాలి. కానీ, శిస్తు వసూలు చేసిన డబ్బులతో పనులు ఎందుకు చేపట్టడం లేదని, వంశధార ఇవ్వలేనప్పుడు నీటి తీరువా ఎందుకు వసూలు చేస్తున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. వంశధార కాలువ నిర్వహణాకు ఏడాదికి సుమారు రూ.కోటి కలెక్టర్ నిధులు కేటాయిస్తుంటారు. అయితే గత రెండేళ్లుగా ఆ నిధులు కూడా కేటాయించడం లేదని తెలుస్తోంది. 2020-21 ఏడాదిలో వంశధార కాలువలో గుర్రపు డెక్క, పూడికలు తీసేందుకు ఏడాదికి రూ.1.10 కోట్లు, మరో ఏడాది కోటి వ్యయంతో పనులు చేపడితే కాంట్రాక్టర్లుకు కేవలం రూ.20 లక్షలు చెల్లించారు. దీంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు కాలువలో గుర్రపు డెక్క, పూడికలు తీసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. పాత బకాయిలు చెల్లిస్తే తప్ప పనులు చేయడం కుదరదని స్పష్టం చేశారు. వాటి కోసం కేటాయిస్తున్న నిధులు వెనుకకు తిరిగి వెళ్లిపోతున్నట్లు తెలుస్తోంది. దీంతో అధికారులు చేసేది ఏమీ లేక ఈ ఏడాది కాలువలో పూడికలు తీసే పరిస్థితి లేకపోయింది. ఇలా గత ఐదేళ్లుగా వంశధార నిర్లక్ష్యానికి గురికావడంతో శివారు భూములకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైతులకు అండగా ఉంటామని చెబుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఈ ఏడాది వంశధార అందే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు చొరవ చూపి శివారు భూములకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఈ ఏడాదైనా సాగునీరందేనా?

కొద్ది సంవత్సరాలుగా ఖరీఫ్ సీజన్లలో సాగునీరు అందక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. వంశధార నీటిపై నమ్మకం లేక రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తుకుంటున్నారు. వంశధార శివారు భూములకు అందడం లేదని పాలకులు, అధికారులు దృష్టికి గత ఐదేళ్లుగా తీసుకు వెళ్లినా ఫలితం లేకపోతుంది. ఈ ఏడాదైనా ఖరీఫ్ సీజన్ నాటికి వంశధార అందించే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటి నుంచే రైతులు వర్షాభావ పరిస్థితులు, వంశధార కాలువ నీటిని నమ్ముకోకుండా గత రెండేళ్లుగా ఎదలు వైపు దృష్టి సారించారు.

రూ.70 కోట్ల ప్రతిపాదనలు

నందిగాం మండలం కణితూరు నుంచి వజ్రపుకొత్తూరు వరకు 20.500 కిలో మీటర్ల వంశధార కాలువకు ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు రూ.70 కోట్ల వ్యయంతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రతిపాదనలు పెట్టడమే తప్ప ప్రభుత్వం నిధులు మంజూరు చేయక పోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా తయారైంది. వంశధార ఆధునికీకరణ పనులు. 2018లో వచ్చిన తిత్లీ తుపాను ధాటికి వంశధార కాలువ ఎక్కడెక్కడ పాడవడంతో అప్పటి అధికారులు రూ.12 కోట్ల వ్యయంతో మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అధికారులు ఇస్తున్న ప్రతిపాదనలు బుట్టదాఖలు అవుతున్నాయే తప్ప ప్రభుత్వం కన్నెత్తి చూడలేదు సరికదా, ఈ ఐదేళ్లలో ఒక్క రూపాయి నిధులు మంజూరు చేయలేదు.

ఉన్నతాధికారులకు నివేదించా

వంశధార కాలువ పనులు చేపట్టేందుకు రూ.1.50 కోట్లు కేటాయించాలని ఉన్నతాధికారులకు నివేదించా. ఈ ఏడాది శివారు భూములకు సాగునీరు అందేలా చర్యలు చేపడుతున్నాం. ఉపాధి హామీ ద్వారా కాలువలో పూడికలు తీయిసఉతన్నాం. ఇప్పటికే నందిగాం మండలంలో పూడికలు తీయించాం.

- శ్రీకాంత్, వంశధార ఇఇ, టెక్కలి



ఈదురాపల్లి వద్ద పాడైన చప్టా

పక్కాగా కౌంటింగ్ ఏర్పాట్లు

- లూజు పెట్రోల్ విక్రయించరాదు
- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కౌంటింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ రోజున పటిష్టమైన భద్రత ఉండాలన్నారు. కౌంటింగ్ ఏర్పాట్లపై కలెక్టర్ ఛాంబరులో ఎస్‌పి జి.ఆర్ రాధికతో కలిసి సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల దృష్ట్యా జిల్లాలో 144 సెక్షన్ కొనసాగాలన్నారు. డిఎస్‌పిలు రెండు సమన్వయ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని 120 పెట్రోల్ బంకుల నుంచి లూజు పెట్రోల్ విక్రయాలు చేయకుండా సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేయాలని డిఎస్ఓ బి.శాంతిశ్రీని ఆదేశించారు. జిల్లాలో పండుగలు చేసుకునే పలు ప్రాంతాల్లో సమూహాలుగా ఉండరాదని స్పష్టం చేశారు. ఆ ప్రాంతాల్లో ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. మందుగుండు సామగ్రి విక్రయించకుండా లైసెన్స్‌లు కలిగిన యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో టెక్కలి రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, అదనపు ఎస్‌పి ప్రేమ్‌కాజల్, ఎస్ఇబి అదనపు ఎస్‌పి గంగాధరం, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు భరత్ నాయక్, సిహెచ్.రంగయ్య, అప్పారావు, లక్ష్మణమూర్తి, సుదర్శన్ దొర, రామ్మోహనరావు, డిఎస్‌పిలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఖరీఫ్‌కు సన్నద్ధం

వ్యవసాయ శాఖ జెడి శ్రీధర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

నైరుతి రుతుపవనాలు ఈనెలాఖరుకు రాష్ట్రంలో ప్రవేశిస్తున్న నేపథ్యంలో ఖరీఫ్ సాగుకు రైతాంగం సన్నద్ధం కావాలని వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్ అన్నారు. మండలంలోని వెంకటాపురంలో నైర వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యాన ఈనెల 20 నుంచి 26 వరకు నిర్వహించే ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు 38 వేల మెట్రిక్ టన్నులు వరి విత్తనాలు, 22 వేల మెట్రిక్ టన్నుల యూరియా, ఇతర క్రిమి సంహారక మందులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ప్రస్తుతం పది వేల మెట్రిక్ టన్నుల వరి విత్తనాలు జిల్లాకు వచ్చాయని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులను విక్రయిస్తామన్నారు. రైతాంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలురకాలుగా ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. వీటిని సక్రమంగా వినియోగించుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. నైర వ్యవసాయ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ గేదెల జోగినాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆత్మ పథక సంచాలకులు ఎ.రామచంద్రరావు, ఎచ్చెర్ల యూనియన్ బ్యాంకు డైరెక్టర్ శ్రీనివాసరావు, నైర కళాశాల అగ్రానమీ ఆచార్యులు ఉపేంద్రరావు, పెంకి జ్యోతిబసు, నైర వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జెడి శ్రీధర్

ఆరోపణలు తగవు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నాయకులు గుండ అప్పలసూర్యనారాయణ తనపై నిందారోపణలు చేయడం తగదని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుండ దంపతులు అంటే తనకెంతో గౌరవమని తెలిపారు. అప్పలసూర్యనారాయణ వ్యవసాయ క్షేత్రంలో ఆయన పనివారు ముందు, ఆయన ఎదుట లక్ష్మీదేవిని దుర్భాషలాడానని ఆయన ఒక ప్రకటనలో పేర్కొనడం శోచనీయమన్నారు. అప్పుడు తామిద్దరం మాత్రమే ఉన్నామని, దుర్భాషలాడలేదని తెలిపారు. దీనిపై తాను బహిరంగ చర్చకూ సిద్ధమేనని పేర్కొన్నారు. ఒక సీనియర్ నాయకునిగా ఆయన అలా మాట్లాడడం తనను బాధించిందని తెలిపారు. ఆయన ఓటు, భావవ్యక్తీకరణ ఆయన ఇష్టమని, అదే సమయంలో ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు. తన ఎన్నికల ప్రచార వాహనంపై ఒకవైపు లక్ష్మీదేవి, మరోవైపు అప్పలసూర్యనారాయణ ఫొటోలు వేశానని, అందుకు కారణం వారిపై ఉన్న గౌరవమేనని తెలిపారు. తనను అసమ్మతి నాయకునిగా గుండ దంపతులు ముద్ర వేస్తే సరిపోదని... ప్రజలు, పార్టీ అధిష్టానం వేయాలని పేర్కొన్నారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన బొలెరో

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయితీ కూర్మనాథపురం వద్ద సోమవారం పెను ప్రమాదం తప్పింది. మూలపేట పోర్టు కోసం తిరుగుతున్న బొలెరో వాహనం అతి వేగంతో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న ఒక ఇంటి వైపు దూసుకెళ్లింది. దీంతో ఇంటి ముందు ఉన్న షెడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో బాధితులు, గ్రామస్తులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఇంట్లోకి దూసుకెళ్లిన బొలెరో

ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తే చర్యలు

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో ఎలాంటి ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా చేపట్టరాదని ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సమూన్ ఆదేశించారు. శ్రీకాకుళం రూరల్ మండలంలోని కిల్లిపాలెం, నగరంలోని హయాతీనగరంలోని ఇసుక రీచ్‌లను ఎస్‌పి జి.ఆర్ రాధికతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లకు వారి జిల్లాల్లో ఎటువంటి ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా జరగకుండా చూడాలని ఆదేశించిందని తెలిపారు.

ఇసుకపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి, వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ డిఎల్ఎస్‌సిలో అధికారులు తనిఖీలు, విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తనిఖీ నివేదిక, తీసుకున్న చర్యల వివరాలను ప్రతి వారం ప్రభుత్వానికి ఇవ్వాలన్నారు. ఇందులో భాగంగా కిల్లిపాలెం, హయాతీనగరంలో ఇసుక రీచ్‌లను తనిఖీ చేయగా, ఎటువంటి ఇసుక తవ్వకాలు, రవాణా లేవని గుర్తించారు. పరిశీలనలో డిపిఒ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి, ఆర్‌డిఒ, ఇరిగేషన్ ఇఇ, భూగర్భజలశాఖ అధికారి, ప్రాంతీయ రవాణాశాఖ అధికారి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి, మైన్స్ అధికారులు, తహశీల్దార్ ఉన్నారు.



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న అధికారులు



తిలక్‌ను గృహ నిర్బంధం చేసిన పోలీసులు

తిలక్ గృహ నిర్బంధం

ప్రజాశక్తి - నందిగాం

వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను పోలీసులు సోమవారం గృహ నిర్బంధం చేశారు. కోటబొమ్మాళి మండలం నిమ్మాడ పంచాయతీ వెంకటాపురంలో వైసిపి, టిడిపి నాయకుల మధ్య తోపులాటలో మృతి చెందిన వైసిపి కార్యకర్త మల్లేష్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు తిలక్ బయలుదేరారు. శాంతిభద్రతల దృష్ట్యా ఎస్ఐ మహమ్మద్ ఆలీ ఆధ్వర్యాన పోలీసులు కణితూరులో ఆయన్ను హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ టిడిపి నాయకులు కింజరాపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు ప్రోత్సాహంతో మల్లేష్‌పై టిడిపి నాయకులు దాడులకు పాల్పడి హత్య చేశారని చెప్పారు. మల్లేష్ కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్తుంటే గృహ నిర్బంధించడం సరికాదన్నారు. మల్లేష్‌ను హత్య చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేసి, మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

యానిమేషన్‌తో అద్భుత అవకాశాలు

ప్రజాశక్తి- నరసన్నపేట

బొమ్మలు వేసే నైపుణ్యం ఉన్నవారు ఆ ఇష్టాన్ని కెరీర్‌గా మలుచుకోవడానికి యానిమేషన్ అనేది అద్భుతమైన అవకాశమని హలో వరల్డ్ సిఇఒ జె.ఉదయ్ కుమార్ అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో నెల రోజుల యనిమేషన్ సర్టిఫికేట్ ప్రోగ్రాం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ యానిమేషన్ ఇండస్ట్రీ కొన్నేళ్లుగా వేగంగా వృద్ధి సాధిస్తుందని అన్నారు. టెలివిజన్, సినిమా, ఇంటర్నెట్‌తో సహా వివిధ ప్లాట్‌ఫారమ్‌ల్లో యానిమేటెడ్ కంటెంట్‌కు డిమాండ్ పెరుగుతోందన్నారు. ఊహలను బొమ్మలుగా చిత్రించి వాటికి ప్రాణం పోయడమే యానిమేషన్ అని సృజనాత్మకత అన్నారు. ఊహాశక్తి, పరిశీలన లక్షణాలు ఉన్న వారు మంచి యానిమేటర్లుగా రాణించగలుగుతారని తెలిపారు. కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ చదువుతోపాటు ఏదో ఒక రంగంలో నిష్ణాతులుగా తయారు కావడం ఆవస్యకమని అన్నారు. అమెరికా, జపాన్ లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఇప్పటికే దీని హవా కొనసాగుతుందని అన్నారు. ఇప్పుడు మన దేశంలో తన సత్తా చూపుతున్న ఈ రంగం రానున్న రెండు మూడేళ్లలో వేగంగా విస్తరించే అవకాశముందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఇన్‌ఛార్జి ముకళ్ల శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు.



ధ్రువపత్రాన్ని అందజేస్తున్న దుర్గాప్రసాద్

స్ట్రాంగ్‌రూమ్‌లు తనిఖీ

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి స్థానిక శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రాల భద్రతా ఏర్పాట్లను ఎస్‌పి జి.ఆర్ రాధిక సోమవారం పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్‌లకు వేసిన సీల్, ప్రవేశమార్గం, వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, కౌంటింగ్ కేంద్రాల వద్ద బార్కెట్ల ఏర్పాట్లు పరిశీలించడంతో పాటు రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీకాకుళం పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఫ్లడ్‌లైట్స్ ఏర్పాటుతో పాటు సిసి కెమెరాల పర్యవేక్షణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్ట్రాంగ్‌రూముల వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల కేంద్ర పోలీస్ బలగాల గార్డు, జిల్లా ఆర్మ్‌డ్ పోలీస్ గార్డు, సివిల్ పోలీస్ బందోబస్తును పరిశీలించి పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్‌రూమ్‌కి నలువైపులా పటిష్ట భద్రతా ఏర్పాట్లు, నిరంతరం సిసి కెమెరాల పర్యవేక్షణపై ఆరా తీశారు. నిరంతరం సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తనిఖీ అధికారులు నిరంతరం పహారాను తనిఖీ చేయాలన్నారు. ఎస్‌పి వెంట ఎఎస్‌పి జి.ప్రేమకాజల్, డిఎస్‌పి వై.శ్రుతి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న ఎస్‌పి రాధిక


పరిశీలిస్తున్న రమణ

చెత్త సంపద కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని చాకిపల్లి, కె.కొత్తూరు గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను డిఎల్‌పిఒ ఐ.వి.రమణ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తలు వేరు చేయడం, తడి, పొడిచెత్తల నుంచి ఎరువు తయారు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈయనతో పాటు ఇఒపిఆర్‌డి బి.మల్లేశ్వరరావు, డిపిఆర్‌సి రిసోర్స్‌పర్సన్ పి.ఆనందరావు, కార్యదర్శులు రమేష్, చంద్రరావు ఉన్నారు.


అవార్డు అందుకుంటున్న షణ్ముఖరావు

జెసిఐకి అవార్డు

ఇచ్ఛాపురం : ఉత్తమ సేవలందించిన స్థానిక జెసిఐ స్వచ్ఛంద సంస్థకు అవార్డు లభించింది. ఈ అవార్డును జెసిఐ అధ్యక్షులు షణ్ముఖరావు సోమవారం విశాఖపట్నంలో అందుకున్నారు. విశాఖలోని జెసిఐ స్వచ్ఛంద సంస్థల జోన్-4 డివిజన్ సమావేశం ఓ ప్రయివేటు హోటల్‌లో నిర్వహించారు. ఈ అవార్డును వైస్ ప్రెసిడెంట్ సనేటర్ సాయి సుదర్ చేతుల మీదుగా అందుకున్నారు. భవిష్యత్‌లో సమాజానికి ఉపయోగపడే మరిన్ని మంచి కార్యక్రమాలు నిర్వహించాలని జోన్ సలహాదారులు రజిత పుసర్ల సూచించారు. కార్యక్రమంలో స్వరూప్‌కుమార్, రాజకుమార్, నవీన్, పవన, ప్రేమ్‌సాయి, కాళ్ల జయదేవ్, రాజ్ కుమర్, గౌరీ శంకర్ పాల్గొన్నారు.


కాలువలో చెత్తను తొలగిస్తున్న గ్రామస్తులు

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి- పోలాకి

సమాజంలో ప్రతిఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే అదే సంపూర్ణ ఆరోగ్యానికి దోహపడుతుందని ఒబిసి రాష్ట్ర కార్యదర్శి తులసిపాటి కృష్ణంరాజు సూచించారు. మండలంలోని రాల్లపాడు కాలనీలో క్లీన్ ఎండ్ గ్రీన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామస్తులతో కలిసి డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించి గ్రామానికి దూరంగా పారబోశారు. అదేవిధంగా నేల బావి చుట్టూ పరిసరాలు శుభ్రం చేశారు. గ్రామానికి ఆణించి పేరుకుపోయిన ముళ్ల చెట్లను, పిచ్చి మొక్కలను తొలగించారు. గ్రామస్తులకు పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.


స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలతో ఎస్ఐ నిహార్, సిబ్బంది

వివాదాలతో జీవితాలు నాశనం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాజకీయ వివాదాల్లో తలదూర్చి యువత తమ విలువైన కాలాన్ని, జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎస్ఐ బి.నిహార్ అన్నారు. సోమవారం వేకువజామున సరుబుజ్జిలి మండలం రొట్టవలసలో పోలీసు సిబ్బందితో కలిసి కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల తగాదాల్లో తలదూర్చవద్దని, కేసుల్లో ఇరుక్కోవద్దని, విలువైన జీవితాన్ని, కాలాన్ని, డబ్బులను కోల్పోవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో తనిఖీలు నిర్వహించి ఎటువంటి పత్రాలు లేని 13 ద్విచక్ర వాహనాలను స్వాదీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ రెడ్డి చంద్రినాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి- ఆమదాలవలస

తెలుగు రాష్ట్రాల బిఎస్ఎఫ్ బ్రేవ్ హార్ట్ గ్రూపు ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో వేసవి కాలం దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు విజయవాడకు చెందిన చందు అన్నారు. సోమవారం ఆమదాలవలస, శ్రీకాకుళం ప్రధాన రహదారిపై వంజంగి గ్రామం వద్ద ఈ గ్రూపు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిఎస్ఎఫ్ సైనికులు మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల తెలుగు ఉద్యోగులు అందరూ ఒక గ్రూపు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దీని ద్వారా రెండు రాష్ట్రాల్లో మొదటగా చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టడానికి ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బిఎస్ఎఫ్ సైనికులు పి.శ్రీనివాసరావు, హెచ్.షణ్ముఖరావు, భరత్‌రెడ్డి జిలానీలతో పాటు సైనికులు పాల్గొన్నారు.

నెలవంకలో సంబరాలు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని నెలవంకలో అసిరిపోలమ్మ నవరాత్రి సంబరాలను సోమవారం రాత్రి నుంచి తొమ్మిది రోజులపాటు వైభవోపేతంగా నిర్వహించ నున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.ఈ వేడుకల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వివిధ వేష ధారణలు, కోలాటాలు, సాముగారిడీలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు ఔత్సాహకులు పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

ఉదయం ఎండలు... సాయంత్రం మబ్బులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలో వారం రోజులుగా భారీగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతోఉదయం తొమ్మిది గంటల నుంచే బయటకు తిరగలేని పరిస్థితి నెలకొంది. తప్పనిసరి బయటకు వచ్చే ప్రజలు ముఖం నిండా ముసుగులు వేసుకొని గొడుగు పట్టుకుని రావాల్సి వస్తోంది. ఉదయం 8 నుంచే ఉష్ణోగ్రతలు పెరగడంతో బయటకు రావడానికి భయ పడుతున్నాడు. మధ్యాహ్నం 4 గంటల వరకు ఎండలు మండితున్నాయి. ఆ తరువాత కారుమబ్బులు కమ్ముకుంటున్నాయి. ఇలా భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉంటున్నాయి. ఇంకా రానున్న వారం రోజుల్లో మరింత ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని, తప్పనసరి బయటకు రావాల్సి వస్తే గొడుగు పట్టుకుని రావడం ఉత్తమమని వైద్యులు చెపుతున్నారు.

పందేల జోరు

- కాయ్ రాజా కాయ్...!
- రంగంలోకి బెట్టింగ్ మాఫియా
- కౌంటింగ్ నాటికి కోట్లు దాటే ఛాన్స్!

పోలింగ్ ముగిసింది. కౌంటింగ్ మిగిలింది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో పందేల జోరు ఊపందుకుంది. బెట్టింగ్ మాఫియా రంగంలోకి దిగింది. బెట్టింగ్ రాయుళ్లు పలానా అభ్యర్థి గెలుస్తాడని పలానా పార్టీకి ఇన్ని ఓట్లు వస్తాయని, అత్యధిక మెజార్టీ వస్తుందని ఇలా రక రకాలుగా బెట్టింగులు సాగుతుండటం విశేషం.

ప్రజాశక్తి- బూర్జ

జిల్లాలో ఆమదాలవలస నియోజకవర్గం అసెంబ్లీ స్థానానికి సంబంధించి ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయని అంశం మొదలుకొని కీలకమైన అభ్యర్థుల సాధించే మెజార్టీల వరకు అన్నింటిపైన బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. వేళల్లోనే కాకుండా లక్షల్లో కూడా పందాలు కాసేందుకు పందాల రాయుళ్ల ఆసక్తి చూపిస్తున్నారు. నియోజక వర్గంలో టిడిపి కూటమి వైసిపి అభ్యర్థుల విజయావకాశాలపై బెట్టింగులు



జోరుగా సాగుతున్నాయి. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు ఓటములను విశ్లేషించేందుకు ఆయా పార్టీల వారీగా రాజకీయ నిపుణులు రంగంలోకి దిగారు. వీరు బూత్‌ల వారీగా పోలైన ఓట్ల వివరాలు వాటిలో యువత ఎంతమంది, మహిళలు ఎంతమంది అనే వివరాలు సేకరించి పార్టీలకు ఓట్లు ఎలా పడి ఉంటాయని అంచనా వేస్తున్నారు. బూత్‌లో పార్టీలకు ఉన్న పట్టును కూడా పరిగణలోకి తీసుకొని గెలుపు ఓటములను అంచనా వేస్తున్నారు. బూత్‌ల వారీగా లెక్కలు వేసుకుని ఒక అంచనాకు వచ్చిన తర్వాత బెట్టింగ్ కోసం అంచనాలను పంపుతున్నారు. క్రికెట్‌కు మించి రాజకీయాల్లో బెట్టింగ్ సాగు తుండడం విశేషం. బెట్టింగ్ బాబుల్లో అధిక శాతం ప్రధాన పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులే ఉండటం గమనార్హం.

నియోజకవర్గ స్థాయిలో ఆయా పార్టీల్లో ముఖ్య నేతలుగా ఉన్నవారు కూడా బెట్టింగ్ నిర్వా హకులుగా వ్యవహరిస్తున్నారు. కేవలం ఆముదాలవలస నియోజక వర్గంకు సంబంధించి టిడిపి కూటమి, వైసిపికి చెందిన కొంతమంది నేతలు బెట్టింగ్ వ్యవహారాలకు కేంద్రంగా మారడం గమనార్హం.

మధ్యవర్తులకు డబ్బే డబ్బు

ఈసారి బెట్టింగ్ కాసేవారు పక్కాగా వ్యవహరిస్తున్నారు. బెట్టింగ్‌కు ముందుకొచ్చిన వారు ముందుగా ఓ ఒప్పంద పత్రం రాసుకుంటున్నారు. ఇద్దరు కలిసి ఒక నమ్మకమైన వ్యక్తి దగ్గర బెట్టింగ్ మొత్తాన్ని ఉంచు తున్నారు. ఫలితం తేలిన తర్వాత ఆ వ్యక్తి ఒప్పందం ఆధారంగా నగదును ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా మధ్య వర్తులుగా ఉన్నవారికి భారీగానే గిట్టుబాటు అవుతుంది. పందెం మొత్తంలో ఐదుశాతం నుంచి 10శాతం వరకు కమిషన్ రూపేనా మధ్యవర్తులకు అందజేయాలని ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. నియోజక వర్గంలో ఇప్పటికే కోట్లాది రూపాయలు పార్టీలపైన, అభ్యర్థుల గెలుపుపైన బెట్టింగులు జరిగినట్లు తెలుస్తుంది. ఫలితాలు వెలవడే నాటికి ఇది రెట్టింపు అయ్యే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

రేపు సంతాప సభ

ప్రజాశక్తి- పొందూరు

ఎపిటిఎఫ్ సీనియర్ నాయకులు, తోలాపికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు కోటిపాత్రుని సంజీవరావు సంతాప సభను ఎపిటిఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 22న తోలాపిలో నిర్వహిస్తున్నట్లు ఎపిటిఎఫ్ సీనియర్ నాయకులు, జిల్లా కార్యదర్శి పప్పల తిరుమలరావు తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే సంతాప సభకు జిల్లా అధ్యక్షులు ఎం.మధన్మోహన్, ప్రధానకార్యదర్శి అనిల్ కుమార్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.రమణరావు, పి.తేజేశ్వరరావు తదితరులు హాజరవు తారన్నారు. ఎపిటిఎఫ్ సభ్యులు, ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు.

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

స్థానిక ఐటిఐ ప్రాంగణంలో ఈ నెల 24న జాబ్ మేళా నిర్వహించబడునని, ఈ జాబ్ మేళాకు ఐటిఐ పాసైన ఏ ట్రేడ్ విద్యార్థులైనా అర్హులని ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 550 ఉద్యోగాలు ఖాళీలున్నాయని, జాబ్‌మేళాలో పాల్గొనే అభ్యర్థులు 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండాల న్నారు. ఎంపికైన అభ్యర్థులకు అన్ని అలవెన్స్‌లు కలుపుకొని రూ.15వేలు నుంచి రూ.18వేలు వరకు జీతం అందిస్తారన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు ఎస్-ఎస్‌సి, ఐటిఐ, క్యాస్ట్, ఆధార్ కార్డు ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు రెండు జతల బయోడేటాలు, రెండు జతల జిరాక్స్ సర్టిఫికెట్ కాఫీలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 9959353636, 6304033963 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.


గుర్తించిన వికలాంగ విద్యార్థినితో అధికారులు

వికలాంగ విద్యార్థిని గుర్తింపు

ప్రజాశక్తి- పొందూరు

సమగ్ర శిక్ష శ్రీకాకుళం సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో సిడబ్ల్యూఎస్ ఐడెంటిఫికేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో పొందూరుకు చెందిన 9వ తరగతి చదువుతున్న అల్లక మోహన రవళి అనే వికలాంగ విద్యార్థిని గుర్తించారు. జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ పూడి జనార్దనరావు, ఎంఇఒలు పైడి వెంకట రామరాజు, పట్నాన రాజారావు, ఐఇఆర్‌టి దినేష్, రాధారాణి పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా విద్యాకానుక పంపిణీ

పొందూరు: ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు జరుగుతున్న విద్యాకానుకల పంపిణీ ప్రణాళికాబద్ధంగా జరగాలని ఎంఇఒలు పి.వి.రామరాజు, పి.రాజారావు, ఎస్ఎస్ఎ సెక్టోరియల్ అధికారి పి.జనార్ధనరావు అన్నారు. మండలంలో విద్యాకానుకల పంపిణీపై సోమవారం ఎంఆర్‌సిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కానుకల్లో ఒక్కో విభాగానికి సిఆర్ఎంటి, పిటిఐ, ఐఇఆర్‌టిలతో కూడిన బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బృందాలకు అప్పగించిన విభాగపు బాధ్యతలను వారు బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పిటిఐలు, సిఆర్ఎంటిలు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఇఒ రామరాజు

సంప్రదాయ ఆటలపై శిక్షణ


ఆటలు ఆడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి వినోదంలో భాగంగా 'వుయ్ లవ్ రీడింగ్' 'లెర్న్ విత్ ఫన్' అనే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జానపద సాంప్రదాయ ఆటలను నేటితరం బాలబాలికలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్న కారణంతో ఈ ఆటల్లో శిక్షణ ఇస్తున్నామని ప్రధానోపాధ్యాయులు చైతన్య తెలిపారు. రోజూ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు యోగాతో ప్రారంభించి తరువాత కర్ర-బిళ్ల, గోళీలాట, జోరోబాలు, ఐదు పెంకులాట, బచ్చాఆట, అష్టాచమ్మా, పులి-మేక, దాడి ఆట, గుంటాట, మండాట, గుడుగుడు గుంచము, పిచ్చుక గూల్లు ఇటువంటి సాంప్రదాయ జానపద ఆటలను పిల్లలకు నేర్పిస్తూ ఉత్సాహపరుస్తున్నారు. గత పది రోజుల నుంచి ఈ ఆటలు కొనసాగిస్తూ పాఠశాల తెరిచే వరకు కొనసాగించడానికి నిర్ణయించారు. కార్యక్రమం వ్యాయామ ఉపాధ్యాయులు తిరుపతిరావు, ఉపాధ్యాయులు భాస్కరరావు, ఆదికేశవరెడ్డి పాల్గొన్నారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లలు ఎక్కువగా సెల్‌ఫోన్లలో ఆన్‌లైన్ ఆటలకే పరిమితమై వ్యాయామంపై అశ్రద్ధ వహిస్తున్నారని అన్నారు. ఈ వీడియో గేమ్, ఆన్‌లైన్ ఆటలను పిల్లల నుంచి దూరం చేయడానికి ఇలాంటి కార్యక్రమం చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. దీనికి తల్లిదండ్రులు, పిల్లల నుంచి స్పందన వస్తుందని అన్నారు.

పలువురికి 'జ్ఞాన బుద్ధపూర్ణ' పురస్కారాలు


ఇచ్ఛాపురం : పురస్కారం అందుకుంటున్న ధనుంజయరెడ్డి

ఇచ్ఛాపురం: మండలంలోని టి.బరంపురానికి జానపద కళాకారులు తిప్పన ధనుంజయ రెడ్డికి జ్ఞాన బుద్ధ పూర్ణ జాతీయ పురస్కారం అందుకున్నారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన ఒంగోలులో ఆదివారం రాత్రి తెలుగు వెలుగు సాహితీ సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహించారు. 25 ఏళ్లుగా శాస్త్రీయ సంగీత, పండరి భజన, కోలాటం, జానపదాలు కళా రంగంలో విశిష్ట సేవలు అందించిన ధనుంజయ రెడ్డికి తెలుగు వెలుగు జ్ఞాన బుద్ధ పూర్ణ జాతీయ పురస్కారం అందజేశారు. ధనుంజయరెడ్డికి జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, ఎంపిపి బోర పుష్ప, డిసిసిబి అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్, సీడాప్ చైర్మన్ సారి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపిపి కారింగి మోహన రావు, ఆల్ ఇండియా కళారంగం వ్యవస్థాపకులు మాడుగుల సుధీర్, టి.బరంపురం సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, కళాకారులు జానకిరామ్‌రెడ్డి, నర్తు గంగయ్య మాస్టర్, కరగాణ లక్ష్మీనారాయణలు అభినందించారు.

మోహనరావుకు...


నందిగాం : పురస్కారాన్ని అందుకుంటున్న మోహనరావు

నందిగాం: తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన ఒంగోలులో సాంస్కృతిక ఉత్సవ పురస్కారాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ మేరకు మండలంలోని నరేంద్రపురానికి చెందిన జీరు మోహరావుకు తెలుగు వెలుగు జ్ఞాన బుద్ధ పూర్ణ జాతీయ పురస్కారాన్ని అందించారు. మోహనరావు తెలుగు వెలుగు భాషాభివృద్ధికి తోడ్పడుతున్న సందర్భంగా ఆయనను పురస్కారం అందించినట్లు తెలిపారు.

కవిటి: తమ సంగీతంతో శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తున్న మండలంలోని కళాకారులు గొనప లక్ష్మణమూర్తి, చలపరాయి రవికుమార్, చలపరాయి వినోద్ కుమార్‌కు అరుదైన గౌరవం లభించింది. దశాబ్ధాలుగా శాస్త్రీయ సంగీతం అభివృద్ధికి వీరు చేస్తున్న కృషిని తెలుగు వెలుగు సాహితీ వేదిక (ఒంగోలు) గుర్తించించి జ్ఞాన బుద్ధ పూర్ణ జాతీయ పురస్కారంతో ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, పలువురు సంగీత కళాకారులు, సంగీత ప్రియులు వీరిని అభినందించారు.

వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి- నందిగాం

స్థానిక శాఖాగ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని గ్రంథాలయ అధికారి ఎస్.ఉదయ్‌కిరణ్ ప్రారంభించారు. విద్యార్థులను సీనియర్స్, జూనియర్స్‌గా విభజించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగానికి సోషల్ మీడియా ఆవశ్యకత, జూనియర్స్ విభాగానికి స్వాతంత్ర ఉద్యమకారులు గొప్పతనంపై నిర్వహించారు. వచ్చే నెల 7 వరకు ఉత్సాహంగా పాల్గొవాలని పిలుపునిచ్చారు. గ్రంథాలయ సహాయకులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి కె.రామకృష్ణ అన్నారు. ఈ మేరకు విద్యార్థులకు చిత్ర లేఖనంపై మెలకువలు, స్పోకెన్ ఇంగ్లీష్‌పై తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

లావేరు: వ్యవసాయం తర్వాత పాడి పరిశ్రమని, ప్రతి విద్యార్థి పాడి పరిశ్రమల కోసం తెలుసుకోవాలని రిసోర్స్ పర్సన్ బైరి దిశిత అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరంలో ఆమె మాట్లాడారు. అలాగే వ్యవసాయం, పాడి పరిశ్రమ కోసం విద్యార్థులకు వివరంగా తెలియజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాధవరావుకు వైసిపి అండ


నివాళ్లర్పిస్తున్న ఎంపిపి ఉమామహేశ్వరరావు

కోటబొమ్మాళి: మండలంలోని నిమ్మాడ పంచాయతీ చిన్న వెంకటాపురానికి చెందిన వైసిపి కార్యకర్త తోట మాధవరావు తండ్రి తోట మల్లేష్‌పై టిడిపి నాయకులు దాడి చేయడంతో మృతి చెందాడని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు ఆరోపించారు. ఈ మేరకు చిన్న వెంకటాపురంలో సోమవారం నిర్వహించిన మల్లేష్ అంత్యక్రియల్లో వైసిపి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం మాధవరావు కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముందుగా మల్లేష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈయనతో పాటు వైసిపి నాయకులు మెండ తాతయ్య, రెడ్డి లక్ష్మణ్, కోతి చిన్నారావు, బోనేల ఎల్లయ్య, బెలమర మహేష్, వాసు, సతీష్, రాము, కేశవ్ ఉన్నారు.

సామాజిక ఆస్పత్రిలో మందుబాబుల వీరంగం

రణస్థలం రూరల్: మండలంలోని కొండములగాంలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మందుబాబులు వీరంగం సృష్టించారు. సోమవారం సాయంత్రం చికిత్స కోసం రణస్థలంకు చెందిన కెల్ల నవీన్ కుమార్, కెల్ల జగన్ అనే ఇద్దరు యువకులు డ్రస్సింగ్‌కు వచ్చి డ్రస్సింగ్ చేస్తున్న శర్వాని, జీవనసుధలపై విచక్షణ రహితంగా ప్రవర్తించడంతో ట్రీట్మెంట్ సరిగా చేయించుకోండని సెక్యూరిటీ గార్డ్ కుమిలి సంతోష్ అనడంతో అతన్ని వెంటపెట్టి మరీ కొట్టారు. డ్యూటీలో ఉన్న వైద్యులు లలిత, వంశీప్రియ, స్టాఫ్‌నర్స్‌లు సుధ, రవణమ్మ, రితికుమారి, నీలిమ జీడీఎ గణేష్‌లపై నానా దుర్భషాలాడి వారిని బెదిరించారు. ఆస్పత్రిలో ఉన్న టేబుల్స్, ఫైల్స్ ధ్వంసం చేసారు. సమాచారం తెలుసుకొని ఆస్పత్రికి వచ్చిన జె.ఆర్.పురం పోలీసులపై


ఆస్పత్రిలో మందుబాబులు

కూడా వీరు తిరగ బడడం విశేషం. నవీన్ కుమార్‌కు దెబ్బలతో ఉండ టంతో 108లో రిమ్స్‌కు తరలించే ప్రయ త్నం చేయగా అతను తప్పించుకు పారి పోయాడని, జగన్‌ను అదుపు లోకి తీసుకున్నట్లు ఎస్ఐ గోవింద రావు తెలిపారు.

ఘనంగా జూనియర్ ఎన్‌టిఆర్ జన్మదిన వేడుకలు


పలాస : అన్నదానం చేస్తున్న అభిమానులు


ఇచ్ఛాపురం : సినీ నటుడు ఎన్‌టిఆర్ జన్మదినం సందర్భంగా అభిమానులు జన్నెల సంతోష్, కాళ్ల జైదేవ్, ధనరాజ్, తులసమ్మ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం 35 మంది రక్తదానం చేశారు. అలాగే అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బత్తిన కృష్ణయ్య, ఎం.డి.జిలాని, కాళ్ల గోపి, నాగరాజు పాత్రో, బుగత వినయ్, సప్ప నితీష్, విజయ్, దేవా, సంతోష్, జగదీష్ పాల్గొన్నారు.

పులిహోర పంపిణీ

కవిటి: సినీ నటుడు జూనియర్ ఎన్.టి.ఆర్ పుట్టినరోజు వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా కపాసుకుద్దికు చెందిన ఎన్‌టిఆర్ అభిమానులు కవిటి నుంచి ఇచ్చాపురం వరకు ఉన్న 300 మంది అనాథలకు పులిహోర పొట్లాలు పంపిణీ చేశారు. మానవ సేవే మాధవ సేవనే తమ నాయకుని మాటను ఆచరిస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు.

పలాస : పలాస-కాశీబుగ్గ టీమ్ తారక్ ట్రస్టు సభ్యులు తమ్మినేని శంకర్, సూర్యప్రకాష్ ఆధ్వర్యాన జూనియర్ ఎన్‌టిఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ మేరకు సాయిరాం ఆలయంలో పేదలకు అన్నదానం చేసి కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, భాస్కర్, రాజశేఖర్, అభి, శ్రీరాములు, మణి, కె.వి.స్వామి, హరి విక్కీ, బాలు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : రక్తదానం చేస్తున్న అభిమానులు


గోవిందరావు మృతదేహం (ఇన్‌సెట్‌లో గోవిందరావు ఫైల్)

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలోని కోదూరుకు చెందిన పాతూరు గోవిందరావు (26) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోవిందరావు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ... కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవులు జరుగుతుండేవి. ఆదివారం రాత్రి మద్యం తాగి ఇంటికి రావడంతో మళ్లీ గొడవలు జరిగాయి. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో వేరే గదిలో ఇంటి ద్వారంపై ఉన్న బీమ్ రంధ్రానికి తువ్వాలు, బెడ్ షీట్‌తో ఉరి వేసుకున్నారు. దీనిని గమనించిన మృతుడి అన్నయ్య రామచంద్ర తలుపులు బద్దలుకొట్టి కిందకు దించారు. కొన ఊపిరితో ఉన్న గోవిందరావును స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా మార్గంమధ్యలోనే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య వనితారాణి, కుమారుడు అభిరామ్, కుమార్తె దర్శిని, తల్లి చిన్నమ్మి ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎస్ఐ టి.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


బెల్లం ఊటలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పాత్రలోవలో పోలీసులు కార్డెన్ సెర్చ్‌లో భాగంగా సోమవారం నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. 700 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో పాతపట్నం సిఐ ఎస్.సాయి, టెక్కలి సెబి సిఐ రాజశేఖర్‌నాయుడు, మెళియాపుట్టి ఎస్ఐ టి.రాజేష్, పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలి

పొందూరు: మండలం నందివాడలో గత కొంతకాలంగా నెలకొన్న విద్యుత్ లోవోల్టేజీ సమస్యను పరిష్కరిం చాలని కోరుతూ గ్రామానికి చెందిన యువకులు ఆందోళన చేపట్టారు. సోమవారం రాపాక కూడలిలో విద్యుత్ ఉపకేంద్రంలో విద్యుత్ అధికారులను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో తరచుగా లోవోల్టేజీ సమస్య తలెత్తడంతో గర్భిణీలు, చిన్నారులు, వృద్ధులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి కాలంలో ఈ సమస్య ఎక్కువగా ఉందని, గ్రామంలో లైన్‌మేన్ కూడా సరిగా స్పందిం చట్లేదని, లోవోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరారు.

'జైహనుమాన్' ఆర్థికసాయం

సంతబొమ్మాళి: మండలంలోని రంకు గ్రామానికి చెందిన బరికివాడు ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడు తున్నాడు. విషయం తెలుసుకున్న జైహనుమాన్ సేవా సంఘం సభ్యులు రూ.91,700 ఆర్థికసాయం సోమవారం అందజేశారు. కృష్ణమూర్తి, టంకాల బాబూ రావు, శ్రీనివాసరావు, రాజు, జగదీష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

లావేరు : మండలంలో గుమ్మడాం పంచాయతీ నాగంపాలెంకు చెందిన టిడిపి యువ నాయకుడు మజ్జి రామ్మూర్తి ఆర్థికసాయం అందజేశారు. గుమ్మడం దళిత కాలనీకి చెందిన నిరుపేదరాలు తీటి సూరమ్మ నివాసం ఉండేందుకు రేకుల షెడ్ నిర్మాణం కొరకు రూ.5 వేలు ఆర్థికసాయాన్ని సోమవారం అందజేశారు. రణస్థలం మండలం వల్లబరావుపేట పంచాయతీ వెంకటరావు పేటలో ఇటీవల మృతి చెందిన బూర్లే చిన్నప్పన్న కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.3 వేలు ఆర్థిక సాయాన్ని అంద జేశారు. వెంకటేష్, జి.సూర్యారావు, భద్రయ్య, పైడిరాజు, శ్రీనివాస్, కెల్లా ఆదినారాయణ, గోపాల్, భాస్కరరావు, వేణు తదితరులున్నారు.

వైసిపి నాయకుల గృహ నిర్బంధం

కోటబొమ్మాళి: మండలంలోని నిమ్మాడ పంచాయతీ చిన్న వెంకటాపురానికి చెందిన వైసిపి కార్యకర్త తోట మాధవరావు తండ్రి మల్లేష్ ఆదివారం మృతి చెందారు. స్వగ్రామంలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడి కుటుంబానికి పరా మర్శిం చేందుకు బయలుదేరిన కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, వైసిపి నాయకులు సంపతిరావు హేమ సుందరరాజు కమలనాభపురం తన స్వగృహంలో, అలాగే రైతు భరోసా అడ్వైయిజరీ కమిటీ జిల్లా సభ్యులు కవిటి రామ రాజులను యలమంచిలిలో తన స్వగృహంలో పోలీసులు గృహ నిర్బంధించారు. కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్తున్న వైసిపి నాయకులను అరెస్టు చేయడం దారుణమని అన్నారు.

10 లారీలు స్టేషన్‌కు తరలింపు

ఆమదాలవలస


లారీ సిబ్బందిని ప్రశ్నిస్తున్న సిఐ

మండలంలోని వంశధార నది పరీ వాహక ప్రాం తం చవ్వాకులపేట రేవు నుంచి అక్ర మ ఇసుకను తరలిస్తారన్న అనుమానంతో సిఐ వాయు నందన్ దివాకర్ యాదవ్ పది లారీలను తనిఖీ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సోమవారం ఆమదాల వలస నుంచి పురుషోత్తపురం వెళ్లే రహదారిలో లారీలు ఒక ప్రాంతంలో నిలిపి ఉంచినట్లు సమాచారం తెలుసుకున్న సిఐ, పోలీసులు, ఎస్ఇబి అధికారులతో అక్కడకు చేరుకుని లారీ డ్రైవర్లను విచారించారు. రాత్రివేళ ఇసుక తరలింపు చేపడ తారన్న అనుమానంతో లారీలను ఆమదాలవలస తరలించి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిలిపి వేయించారు. దీనిపై సిఐను వివరణ కోరగా ఆ రహదారిలో లారీలు ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నట్లు పలు గ్రామాల ప్రజలు, పలువురు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలియడంతో లారీలను ఆమదాలవలస తరలించి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.